
సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 4 । జూలై । 2023



బాలుడిని బలిగొన్న ఆర్టీసీ బస్సు

అతి వేగం కారణంగా ఏడేళ్ల బాలుడు అసువులు బాశాడు. తమ బిడ్డ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం రోదన వర్ణనాతీతంగా మారింది. - IIలో▸



డెల్టాలకు 8,105 క్యూసెక్కులు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 2,250, మధ్య డెల్టాకు 1,615, పశ్చిమ డెల్టాకు 4,240 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టారు.

గరిష్ఠం/కనిష్ఠం
44.0° / 28.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	44.0	29.0
కాకినాడ	39.0	28.5
అమలాపురం	40.5	29.0

న్యూస్‌రీల్

జేకేసీ వినతులకు సత్వర పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ: స్పందన, జగనన్నకు చెబుదాం (జేకేసీ)లకు వచ్చే వినతులను తక్షణమే నూరు శాతం పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టరు ఎస్.తేజ్ భరత్, డీఆర్వో జి.నరసింహులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాజాగా 124 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో ఆన్‌లైన్ ద్వారా 103, ఆఫ్‌లైన్‌లో 21 వచ్చాయన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే వినతులను అదేరోజు పరిశీలించేలా జిల్లా శాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సంపూర్ణంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతీవారం ఈ అంశంపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఏ ఒక్క అర్జీ పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.

వ్యాధుల నిర్మూలనకు పటిష్ట చర్యలు

- శుభ్రతపై ప్రజలకు అవగాహన
- అధికారులతో కలెక్టర్ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా సమన్వయ శాఖలతో వైద్యాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణపై జూలై 31 వరకు నిర్వహించే మలేరియా నివారణ మాసోత్సవ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి బాధితులను గుర్తించి, వైద్య సేవలందించాలని సూచించారు. శుభ్రతపై అవగాహన కోసం పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది, గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ వ్యాధులకు అందించే చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. లార్వా ఉత్పత్తి చెందకుండా మురుగు కాలువలు, నీటి గుంటల్లో మందు పిచికారీ చేపట్టాలని, ఇందుకోసం మున్సిపల్ పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి జి.వీరయ్య, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వివిధ కోర్సులలో శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టరేట్ ఆవరణలో ఉన్న నేక్ భవనంలోని పార్లమెంటరీ నియోజకవర్గ స్కిల్ కళాశాలలో నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా స్కిల్ కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ అల్లంరాజు శ్రీరామచంద్రమూర్తి, నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ జే.రాజు తెలిపారు. రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్ (నేక్) సంయుక్త ఆధ్వర్యంలో సీడాప్, డీడీయూ, జీకేవై పథకం ద్వారా ఈనెలలో ప్రారంభమవుతాయన్నారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసున్న గ్రామీణ యువత అర్హులన్నారు. సర్వేయర్, ఫోర్ మ్యాన్ ఎలక్ట్రికల్ వర్క్స్ కన్‌స్ట్రక్షన్ కోర్సుల్లో శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తామన్నారు. సర్వేయర్‌కు ఒకేషనల్ ఇంటర్మీడియెట్‌లో కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ లేదా సివిల్‌తో ఐటీఐ/డిప్లమా లేదా ఏదైనా డిగ్రీ కలవారు అర్హులన్నారు. ఫోర్‌మ్యాన్ ఎలక్ట్రికల్ వర్క్స్ కోర్సుకు ఐటీఐ, డిప్లమో ఎలక్ట్రికల్ లేదా ఇంటర్, ఒకేషనల్‌లో ఇంటర్మీడియెట్ ఎలక్ట్రికల్ చేసిన వారు అర్హులన్నారు. సర్వేయర్ కోర్సుకు డీఎస్ మూర్తి (96667 71765), ఫోర్ మ్యాన్ కోర్సుకు కనకదుర్గా మహాలక్ష్మి (62811 14627)ని సంప్రదించాలన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది

అన్నవరం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఇబ్బడి ముబ్బడిగా..



రాజమహేంద్రవరం రూరల్ ప్రాంతంలోని శాటిలైట్ సిటీ పాఠశాల

- ప్రభుత్వ పాఠశాలల్లో లక్ష్యానికి మించి ప్రవేశాలు
- ప్రైవేటు స్కూళ్ల నుంచి ఏటా పెరుగుతున్న వలసలు
- ప్రభుత్వ పథకాలతో గణనీయ మార్పు
- నాడు–నేడుతో కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ స్కూళ్లు

❖ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాధారణంగా అన్ని తరగతులకు కలిపి 1,000 మంది విద్యార్థులకు పరిమితి ఉంది. పాఠశాలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దడం, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడంతో ఈ ఏడాది ఇప్పటికే 1,495 అడ్మిషన్లు జరిగాయి. అంటే లక్ష్యానికంటే 495 ప్రవేశాలు అధికంగా జరిగాయి. ఇవి ఇంకా పెరిగే అవకాశం ఉంది.

❖ కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రవేశాలకు నిర్దేశించిన లక్ష్యం 800 ఉండగా.. ఇప్పటికే 1071 విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. పాఠశాలల్లో చేరేందుకు ఇంకా సమయం ఉన్న కారణంగా మరింత మంది చేరే అవకాశం ఉంది. కేవలం రెండు స్కూళ్లే కాదు జిల్లా వ్యాప్తంగా వందల పాఠశాలల్లో ఇదే పరిస్థితి.

సాక్షి, రాజమహేంద్రవరం: విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సమూలమార్పులు సత్ఫలితాలనిస్తున్నాయి. ఈ ప్రభావంతో ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరుగుతోంది. గత నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. తాజాగా మరో గణనీయ మార్పు ఆవిష్కృతమైంది. ఈ విద్యా సంవత్సరంలో సర్కారు బడుల్లో నిర్దేశించిన అడ్మిషన్ల కంటే అధికంగా ప్రవేశాలు జరుగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు వచ్చి చేరుతున్న వారు వందల సంఖ్యలో ఉంటున్నారు. ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుండగానే అంత మంది చేరుతున్నారంటే ప్రవేశాలు ముగిసే సమయానికి వేల సంఖ్యలో చేరే అవకాశం ఉందని విద్యారంగానికి చెందిన వారు అంచనా వేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు కలిగిన నమ్మకం దర్పనమిస్తోంది. ప్రవేశాలు వెల్లువలా పెరుగుతున్నా ప్రభుత్వం మాత్రం ఎవరినీ చేర్చుకోకుండా వెనక్కు పంపకూడదన్న ఆదేశాలతో ఎంత మంది విద్యార్థులు వచ్చినా అడ్మిషన్లు ఇస్తున్నారు.

దోహదపడుతున్న పథకాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి. 'నాడు–నేడు' పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చి దిద్దడం. అమ్మఒడితో పేదింటి విద్యార్థుల విద్యకు బాటలు వేస్తోంది. జగనన్న గోరుముద్దతో రుచికరమైన పౌష్టికాహారం అందజేస్తోంది. స్కూళ్లల్లో విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడంతో ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది.

లక్ష్యానికి మించి అడ్మిషన్ల తీరు ఇలా..

పాఠశాల	ప్రవేశాలు
జెడ్పీహెచ్ఎస్ శాటిలైట్ సిటీ	1495
జెడ్పీహెచ్ఎస్, చాగల్లు	1071
జెడ్పీహెచ్ఎస్, ధవళేశ్వరం	1024
ఎంపీహెచ్ఎస్, లాలాచెరువు	991
జెడ్పీహెచ్ఎస్, కడియం	973
జెడ్పీహెచ్ఎస్, కామరాజుపేట, గోకవరం	972
జెడ్పీహెచ్ఎస్, ఉండ్రాజవరం	957
జెడ్పీహెచ్ఎస్ పందలపాక, బిక్కవోలు	874
జెడ్పీహెచ్ఎస్, చిన్నయగూడెం, దేవరపల్లి	849
జెడ్పీహెచ్ఎస్, అనపర్తి	843





చాగల్లు జిల్లా పరిషత్ పాఠశాల

ప్రతి ఒక్కరికీ ప్రవేశం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. విద్యార్థిని పాఠశాలలో చేర్పేందుకు వచ్చిన వారిని వెనక్కు పంపకుండా చేర్చుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో లక్ష్యానికి మించి సీట్లు భర్తీ అయ్యాయి. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. అందుకు అనుగుణంగా వసతులు కల్పిస్తున్నాం. అవసరమైన చోట అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నాం.

– ఎస్.అబ్రహం, డీఈఓ

ప్రవేశాలు పెరిగేందుకు ఉపకరిస్తున్న అంశాలు

- అమ్మఒడితో పేద విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక ఆసరా కల్పిస్తోంది. ఏటా ఒక్కో విద్యార్థికి రూ.15,000 ఆర్థిక సాయం అందజేస్తోంది. ఏటా జిల్లా వ్యాప్తంగా 1,55,769 మంది విద్యార్థులకు రూ.233.65 కోట్లు అందజేస్తోంది. తద్వారా ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువుకుంటున్నారు.
- జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనం పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,011 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. దాదాపు 1.26 మంది మధ్యాహ్న భోజనం లబ్ధి పొందుతున్నారు. మెనూలో మార్పులు తీసుకువచ్చి బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారు.
- జగనన్న విద్యాకానుక ద్వారా స్కూల్‌బ్యాగ్, యూనిఫాం, బెల్ట్, టెక్ట్ బుక్, వర్క్‌బుక్స్, డిక్షనరీ ఇలా ఒక ప్రత్యేక కిట్ అందజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1.27 లక్షల మంది విద్యార్థులకు రూ.30.50 కోట్ల విలువైన వస్తువులు అందిస్తున్నారు.
- విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభతరం చేసేందుకు బైజూస్ ట్యాబ్స్ అందజేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది విద్యార్థులకు 16,024, ఉపాధ్యాయులకు 1802 మొత్తంగా 17,826 ట్యాబ్‌లు పంపిణీ చేశారు.
- ×నాడు–నేడు₹ పథకం ద్వారా రెండు విడతల్లో పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నారు. తొలి విడత పనులు ఇప్పటికే పూర్తవగా రెండో దశలో 675 పాఠశాలలకు 1,006 పనులకు గాను రూ.271 కోట్లు చేపడుతున్నారు.

పాఠశాలలో అన్ని వసతులు



పాఠశాలలో ఆహ్లాదకరమైన వా తావరణం ఉంది. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించారు. పాఠశాలలు తెరిచే సమయానికి టెక్ట్‌బుక్స్, యూనిఫాం ఇచ్చారు. రుచికరమైన భోజనం తింటు న్నాం. చదువుకునేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాల అంటే సౌకర్యాలు ఉండేవి కాదు. ఇప్పుడు అలాంటి భయం లేదు. కార్పొరేట్ స్థాయిలో ఉండటంతో ఆనందంగా చదువుకోగలుగుతున్నాం.

– దీవెన, 8వ తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్ చాగల్లు

ప్రైవేట్ సూళ్ల అడ్మిషన్లతో పోలిక ఇలా...

సంవత్సరం	ప్రైమరీ	అప్పర్	ప్రైమరీ	హైస్కూల్	మొత్తం
2021–22	ప్రభుత్వ	1,97,630	43,263	2,46,865	4,87,758
2021–22	ప్రైవేటు	68,655	52,452	1,39,012	2,60,119

పేదలపై భారం లేకుండా టిడ్కో ఇళ్ల పంపిణీ



టిడ్కో ఇళ్లపై మంత్రుల సమీక్ష

- వాస్తవాలు తెలియకుండా లేనిపోని విమర్శలు చేస్తున్న టీడీపీ
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

రాజానగరం: పేదలపై భారం వేయకుండా ఇళ్లను సమకూర్చుతుంటే టీడీపీ లేనిపోని విమర్శలు చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. రాజానగరం మండలంలోని జగన్నాధపురంలోని ఒక ప్రైవేట్ సమావేశ మందిరంలో హోంమంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టరు కె.మాధవీలత, టిడ్కో చైర్మన్ జె. ప్రసన్నకుమార్, ఎండీ సీహెచ్ శ్రీధర్‌లతో కలిసి కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం మున్సిపల్ పరిధిలో ఉన్న టిడ్కో ఇళ్లపై సోమవారం సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో పేదలకు 7 లక్షల ఇళ్లను అందించేందుకు ఒక్కో పేదోడిపై రూ. 6 లక్షల ఆర్థిక భారం వేశారన్నారు. జగనన్న ప్రభుత్వం ఆ భారాన్ని తొలగించి, రూ.11 వేల కోట్లు ఆర్థిక భారాన్ని భరించి, 1.45 లక్షల మందికి ఒక్క రూపాయికే టిడ్కో ఇంటిని అందించిందన్నారు. ఈ వాస్తవాలను పక్కనబెట్టి బురద చల్లేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గూడు లేకుండా ఏ ఒక్కరూ బాధపడకూడదనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం పేదలకు నివాస స్థలాలు, టిడ్కో ఇళ్ల పంపిణీ చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఆఖరు నాటికి 2.62 లక్షల మంది పేదలకు టిడ్కో ఇళ్లు పంపిణీ చేయనున్నామన్నారు. పట్టణ ప్రాంతాలలో ఉంటున్న నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలనే సీఎం సంకల్పం మేరకు ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ నెలాఖరు నాటికి లక్ష ఇళ్లను అందించాలని లక్ష్యమన్నారు. ఇప్పటికే 75వేల ఇళ్లను పంపిణీ చేశామన్నారు. హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ కేటగిరి–ఏ పరిధిలోని ఇంటిని ఒక్క రూపాయితో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నామన్నారు. కేటగిరి–సీలోని 240 ఇళ్లకుగాను 165 మందికి బ్యాంకు రుణాలను మంజూరు చేశామన్నారు. సమావేశంలో కొవ్వూరు పురపాలక సంఘం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్‌చైర్మన్‌లు మన్నే పద్మావతి, గంధ్రోతు అంజలీదేవి, మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్, టిడ్కో ఇంజనీర్లు, తదతరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబానికి రూ.7 లక్షల సాయం

చెక్కు అందించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: నమ్ముకున్న వ్యవసాయం కలిసి రాలేదు. ఆరుగాలం కష్టించినప్పటికీ నష్టాలే మిగిలాయి. దిక్కు తోచని స్థితిలో నిస్పృహ చెందిన కౌలు రైతు క్షణికావేశంలో చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దయనీయమైన అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సంకల్పించింది. రూ.7 లక్షల సాయం అందించి, అండగా నిలిచింది. ఆ వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన కఠంశెట్టి నర్సింహమూర్తి మూడెకరాలు కౌలుకు తీసుకుని అరటి పండించేవాడు. గాలిదుమ్ము, ఈదురు గాలుల వల్ల అరటి బొందలు విరిగిపోవడంతో నష్టం వచ్చింది. మరికొంత సొమ్ము అప్పు తీసుకుని రెండో ఏడాది కూడా అరటి పంట వేశాడు. ఈ సారి కూడా వాతావరణం నర్సింహమూర్తికి సహకరించలేదు. బలంగా వీచిన ఈదురు గాలులకు ఏపుగా ఎదిగిన పంట నేలకొరిగింది. పెట్టిన పెట్టుబడి, పడిన శ్రమ వృథా అయ్యాయి. మూడో సంవత్సరం పంట బాగా పండినా గిట్టుబాటు ధర లభించలేదు. లెక్క వేసే రెండేళ్లకు కలిపి రూ.8 లక్షల అప్పు కనిపిస్తోంది. దిక్కు తోచలేదు. ఈ ఏడాది జనవరిలో పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మాధవి ఏకాకి అయ్యింది. ఆ కుటుంబం గురించి తెలుసుకున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పరిస్థితిని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా వివరాలు తెప్పించుకుని, సాయం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆయన విజ్ఞప్తి మేరకు కఠంశెట్టి నర్సింహమూర్తి భార్య మాధవికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7 లక్షల సాయాన్ని విడుదల చేసింది. ఈ మొత్తానికి చెక్కును ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు సోమవారం ఖండవల్లి గ్రామంలో మాధవికి అందజేశారు. ఆ చెక్ అందుకున్న మాధవి కొద్దిసేపు మాట రాలేదు. తర్వాత తేరుకున్న ఆమె ×జగనన్న పుణ్యమా అని నేను బతకడానికి ఆధారం దొరికింది. మా కుటుంబం జగనన్నకు, ఎమ్మెల్యే గారికి రుణపడి ఉంటాం. అంటూ కన్నీటితో తెలిపింది. కార్యక్రమంలో పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఖండవల్లిలో కౌలురైతు కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

రూ.70 కోట్లతో గోదావరి గట్టు అభివృద్ధి



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ మాదిరిగా రాజమహేంద్రవరం గోదావరి గట్టును వచ్చే సంవత్సరానికి సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ భరత్ రామ్ తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.70 కోట్లు మంజూరు చేసిందని, రానున్న పది రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. వారం, పది రోజుల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి, నగర వాసులు, ప్రముఖుల అభిప్రాయాల మేరకు గోదావరి గట్టును అభివృద్ధి చేస్తామని ఆయన సోమవారం మీడియాకు తెలిపారు.

ఓటరు నమోదులో బాధ్యతగా ఉండాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఎన్నికల అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నూతనంగా రూపొందించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అప్లికేషన్ విధానంపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఓటరు జాబితా డేటా నమోదు విషయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులదే పూర్తి బాధ్యత అన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ ద్వారా ఇంటింటికీ ఓటర్ల ధ్రువీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, పునఃఏర్పాటుపై క్షేత్రస్థాయి పర్యటన చేసి, అందుకు అనుగుణంగా నివేదిక అందజేయాలన్నారు. ఫార్మెట్ 1 నుంచి 8 ఎన్నికల అధికారులు, సహాయ అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకుని రూపొందించాలన్నారు. అనంతరం కేంద్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన తాజా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అప్లికేషన్, విధానంపై జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అవగాహన కల్పించారు. జూలై 20లోగా పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోలకు శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. బీఎల్‌వోలు జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటి పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 28 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 37 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు. 14 సివిల్, 6 కుటుంబ తగాదాలు, 8 ఇతర విషయాలకు సంబంధించి సమస్యలు రాగా వాటిపై చట్టపరంగా వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

సబ్సిడీపై టమాటాల విక్రయం

రైతు బజారులో ప్రారంభించిన హోంమంత్రి

కొవ్వూరు: దిగుబడులు తగ్గడంతో మార్కెట్‌లో టమాట ధర ఈ ఏడాది భారీగా పెరిగిందని, ప్రజలపై పెరిగిన భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుందని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. రూ.50కే కిలో టమాటాలను అందజేస్తోందన్నారు. పట్టణంలో మెరకవీధిలోని రైతు బజార్‌లో సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న టమాట విక్రయాలను మంత్రి సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో టమాటా రూ.100 నుంచి రూ.120ల వరకు ఉన్నప్పటికీ సబ్సిడీ పై మంచి నాణ్యమైన సరకును రూ.50కే అందిస్తున్నామన్నారు. నిత్యావసర ధరల నియంత్రణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలు,తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గి టమాటాకు డిమాండ్ ఏర్పడిందన్నారు. రాజమహేంద్రవరం,కొవ్వూరులో రైతు బజార్లకు 5 మెట్రిక్ టన్నుల సబ్సిడీ టమాటా అందుబాటులోకి తెచ్చామన్నారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్న కుమారి, జిల్లా అగ్రి ట్రేడ్,మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్ వినయ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, ఏఎంసీ కార్యదర్శి టి.శ్రీనివాసులు,ఎస్టేట్ ఆఫీసర్ సీహెచ్ సత్యనారాయణ,అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర,పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో టమాటా విక్రయాలను ప్రారంభిస్తున్న జేసీ తేజ్ భరత్



కొవ్వూరు రైతు బజార్‌లో సబ్సిడీపై ప్రభుత్వం విక్రయిస్తున్న టమాటాల విక్రయాలను ప్రారంభించిన హోమ్ మంత్రి తానేటి వనిత

రూ. 50కే అమ్మకాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వినియోగదారుల కోసం రైతు బజార్ల ద్వారా కిలో టమాటాలను సబ్సిడీపై రూ.50కు అందజేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని రైతు బజార్‌లో టమాటా విక్రయాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అనంతపురం జిల్లా మదనపల్లె నుంచి తొలి విడతగా 5 వేల కేజీల టమాటాలను తీసుకువచ్చామని, వీటిని ఎనిమిది రైతుబజార్ల ద్వారా ప్రజలకు సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి కేజీ చొప్పున విక్రయిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్‌శాఖ అధికారి ఎం.సునీల్ వినయ్, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ రోజియా పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ 12వ నంబర్ గేట్ వద్ద సోమవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం నీటిలో తేలింది. మృతుడి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని ధవళేశ్వరం పోలీసులు వెల్లడించారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ధవళేశ్వరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కె.మంగాదేవి సూచించారు.

సాగునీటి ఎద్దడి లేకుండా అదనపు జలాలు

మంత్రి చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం: తొలకరి సమీపించినా వర్షాలు పడకపోవడంతో రైతులకు అదనపు జలాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ వి.వి.రామకృష్ణ, డ్రైనేజీ డీఈ ఆర్.నాగేంద్ర కుమార్, ఏఈలు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల, వ్యవసాయాధికారులతో సాగునీటి ఎద్దడి గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుతం విడుదలవుతున్న సాగునీటికి అదనంగా 30 శాతం నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ ఈఎన్సీ నారాయణరెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. దీనికి ఆయన సమ్మతించి నీటిని విడుదల చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. తొలకరి పనులకు ఆటంకం లేకుండా ధవళేశ్వరంలో నీటి విడుదల శాతాన్ని పెంచారని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి వేణుగోపాలకృష్ణ తెలిపారు.

బాలుడిని బలిగొన్న ఆర్టీసీ బస్సు



సంఘటనా స్థలంలో బంధువుల రోదనలు



బాధిత కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న ఎంపీ భరత్‌రామ్, రూరల్ కో–ఆర్డినేటర్ నాగేశ్వర్

- అతి వేగమే అనర్థానికి కారణం
- కట్టలు తెంచుకున్న గ్రామస్తుల ఆగ్రహం
- బస్సు ధ్వంసం..డ్రైవర్‌కు దేహశుద్ధి
- రూ.10 లక్షల సాయాన్ని అందజేసిన ఎంపీ భరత్‌రామ్, రూరల్ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: అతి వేగం కారణంగా ఏడేళ్ల బాలుడు అసువులు బాశాడు. అప్పటి వరకు ఇంట్లో సందడి చేసిన తమ బిడ్డ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం రోదన వర్ణనాతీతంగా మారింది. ఆర్టీసీ డ్రైవర్ అతి వేగంగా వచ్చి టిఫిన్ కోసం బైక్‌పై వెళుతున్న తండ్రి కొడుకులను ఢీకొట్టడంతో స్థానిక ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి చుదువుతున్న గుంజే ఈశ్వర్‌దుర్గ (7) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కళ్లెదుటే అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఏకైక కుమారుడు మృతి చెందడంతో తండ్రి బోయేసు రోదన అక్కడ ఉన్నవారిని కంట తడి పెట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి..



గుంజే ఈశ్వర్‌దుర్గ (ఫైల్)



గాయాలపాలైన ఆర్టీసీ బస్సు డ్రైవర్

స్థానిక వడ్డెర కాలనీకి చెందిన గుంజే బోయేసు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బోయేసుకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఉదయం వడ్డెర కాలనీ సమీపంలోని హోటల్ నుంచి టిఫిన్ తీసుకువచ్చేందుకు బైక్‌పై కుమారుడు ఈశ్వర్ దుర్గతో కలిసి రోడ్డుపైకి వచ్చాడు. వెనుక నుంచి ఆర్టీసీ బస్సు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బోయేసు రోడ్డు అవతల పక్క పడగా బాలుడు ఈశ్వర్ దుర్గ టైర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో



స్థానికుల దాడితో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

కోపోద్రిక్తులైన స్థానికులు ఆర్టీసీ డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం బస్సును ధ్వంసం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. తీవ్రగాయాలైన ఆర్టీసీ డ్రైవర్‌ను పోలీసులు భారీ బందోబస్తు నడుమ 108వాహనంలో అక్కడి నుంచి తరలించారు. డ్రైవర్ తరలింపునకు కూడా స్థానికులు అడ్డు తగిలారు. 108 వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. న్యాయం జరిగే వారకు బాలుడి మృతదేహాన్ని తరలించడానికి వీలు లేదని స్థానికులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపైనే టెంట్ వేసుకొని ఆందోళనకు దిగారు. దీంతో పలుసార్లు పోలీస్, రెవెన్యూ, ఆర్టీసీ అధికారులు స్థానికులతో చర్చించారు. అయినప్పటికీ స్థానికులు శాంతించలేదు. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ,మాజీ డిప్యూటీ మేయర్ బొక్క ప్రసాద్ బాధితులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రభుత్వ పరంగా సాయం అందిస్తామని ఎంపీ భరత్‌రామ్, కో–ఆర్డినేటర్‌నాగేశ్వర్ హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూరల్ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ చేతుల మీదుగా రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

మధ్యాహ్నం వరకు తీవ్ర ఉద్రిక్తత

బాలుడి మృతితో ధవళేశ్వరం ప్రధాన రహదారిపై తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రధాన రహదారిపై స్థానికులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఐఎల్‌టీడీ నుంచి బొమ్మూరు వైపునకు, ధవళేశ్వరం వైపు వచ్చే ట్రాఫిక్‌ను వేమగిరి నుంచి బొమ్మూరు వైపు మళ్లించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రజనీ, రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ శ్రీనివాసులు, ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి, కడియం సీఐ తిలక్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అంబాజీపేట: అతివేగంగా, అజాగ్రత్తగా ఆటో నడుపుతూ ఓ మహిళను ఢీ కొట్టగా కాకినాడ ఆస్పత్రిలో చికిత పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇరుసుమండకు చెందిన కుడుపూడి వెంకటలక్ష్మి (45) గత నెల 30వ తేదీ రాత్రి టిఫిన్ తెచ్చుకునేందుకు పుల్లేటికుర్రు వెళ్లింది. ఈ సమయంలో రోడ్డు దాటుతున్న వెంకటలక్ష్మిని అంబాజీపేట నుంచి ముక్కామల వైపు వెళుతున్న ఆటో వెనుక నుంచి బలంగా ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రురాలిని 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించగా అదే రోజు మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటలక్ష్మి మృతి చెందిందన్నారు. మృతురాలి మేనల్లుడు చొల్లంగి సాయిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పి.భగవాన్‌నారాయణ తెలిపారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులు స్కూల్లో చదివే అవకాశం

పునఃప్రవేశ కార్యక్రమం ప్రారంభించిన ఆర్‌జేడీ నాగమణి

కాకినాడ రూరల్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ ఏడాది పదో తరగతి చదివేందుకు రాష్ట్ర విద్యాశాఖ అవకాశం కల్పించిందని ఆర్జేడీ జి.నాగమణి అన్నారు. సోమవారం సర్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పునః ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడారు. విద్యార్థుల భవిత దృష్ట్యా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. పదో తరగతి చదివేందుకు తిరిగి పాఠశాలలో చదివే విద్యార్థులకు రెగ్యులర్ విద్యార్థులకు చెందే సంక్షేమ పథకాలు జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి వస్తుందన్నారు. ఇంటి దగ్గర చదవాలని ఉన్నా వారు చదివే పరిస్థితి ఉండకపోగా కాలం వృథా చేస్తారన్న ఉద్దేశంతో పాఠశాల వాతావరణమే వారి భవిష్యత్తుకు మేలు జరుగుతోందని పునః ప్రవేశ కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యాశాఖ ప్రారంభించిందన్నారు. గతంలో ఇప్పటి వరకు ఇలాంటి వెసులుబాటు విధానం లేదని, ఈ ఏడాదే ప్రవేశ పెట్టినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదిమంది విద్యార్థులను పాఠశాలకు ఉపాధ్యాయులు రప్పించగా వారితో ఆర్జేడీ నాగమణి మాట్లాడి మోటివేట్ చేయగా ఐదుగురు పాఠశాలలో చేరడానికి సిద్ధమవగా వారికి జగనన్న విద్యా కానుకలను అందజేశారు. విద్యాకమిటీ కోఆప్టెడ్ సభ్యులు ఎల్.ఎస్.వీరభద్రరాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. డీవైఈఓ రాజు, ప్రధానోపాధ్యాయులు డి.సత్యనారాయణరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థికి అందజేస్తున్న ఆర్‌జేడీ నాగమణి

జేఎన్‌టీయూకేలో తత్కాల్ ఓడీ సౌకర్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ అనుబంధ కళాశాల విద్యార్థులకు తత్కాల్ ఓడీ(ఒరిజనల్ డిగ్రీ) సదుపాయం కల్పించినట్లు వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఇప్పటివరకూ తత్కాల్ విధానంలో పీసీ (ప్రొవిజనల్ మార్కుల జాబితా) మాత్రమే ఇచ్చేవారమన్నారు. విద్యార్థుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఒరిజనల్ డిగ్రీ ఒక్కరోజులోనే అందజేస్తున్నామన్నారు. ఉద్యోగాలు పొందినవారు లేదా విదేశాల్లో ఉన్నత విద్యకు వెళ్లేవారికి ఇదెంతో ఉపయోగకరమన్నారు. వర్సిటీకు అనుబంధంగా ఉన్న పాత ఉమ్మడి ఎనిమిది జిల్లాలలోని ఇంజినీరింగ్, ఫార్మా, మేనేజ్‌మెంట్ కళాశాలల్లో కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ఈ సౌకర్యం వినియోగించుకోవాలని సూచించారు.

పదోన్నతుల కోలాహలం

- 59 స్థానాల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా ఎస్‌ఏలకు అవకాశం
- డీఈవో వెబ్‌సైట్‌లో సీనియార్టీ జాబితాలు
- నేడు గ్రేడ్–2 హెచ్‌ఎం, రేపు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కౌన్సెలింగ్

రాయవరం, బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇప్పుడు విద్యాశాఖలో పదోన్నతుల కోలాహలం కొనసాగుతోంది. కొద్దిరోజుల క్రితం ఎంఈవో–2లను నియమించిన ప్రభుత్వం, ఆదివారం ఎంఈవో–1 పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న 27 ఎంఈవో–1 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించగా, 20 పోస్టులు భర్తీ అయ్యాయి. ఎంఈవో–2 పోస్టుల భర్తీ సందర్భంగా ఖాళీ ఏర్పడిన గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వీలుగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించి, జిల్లా వ్యాప్తంగా ఖాళీలను వెల్లడించడంతో పాటు సీనియారిటీ జాబితాలను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పోస్టులు 59 వరకు ఖాళీలున్నాయి. ఈ ఖాళీలను అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల ద్వారా భర్తీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేస్తోంది. మంగళవారం మధ్యాహ్నం గ్రేడ్–2 హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న వారితోనే భర్తీ చేసేలా నిర్ణయించారు. అలాగే గ్రేడ్–2 పదోన్నతులు, పీజీటీ పదోన్నతుల ద్వారా ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి కూడా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ఏర్పడిన ఖాళీలను అర్హులైన జిల్లా పరిషత్ యాజమాన్యంలో విధులు నిర్వర్తిస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో భర్తీ చేయనున్నారు.

అడహక్ కమిటీ ప్రాతిపదికన

స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించడానికి విద్యాశాఖ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. ఈ పదోన్నతులు అడహక్ కమిటీ సూచించిన మార్గదర్శకాల ప్రకారం చేపడతారు. ఇప్పటికే గ్రేడ్–2 హెచ్‌ఎం సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించి డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు. గ్రేడ్–2 హెచ్‌ఎంల పదోన్నతుల అనంతరం ఏర్పడిన ఖాళీలతో పాటు, జీవో 117 ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల రోల్‌కు అనుగుణంగా ఎక్కడ ఏ సబ్జెక్టు ఉపాధ్యాయుడు అవసరమో గుర్తిస్తారు. జిల్లా వ్యాప్తంగా, సబ్జెక్టుల వారీగా ఎన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయో నిర్ధారించుకున్న అనంతరం ఎస్‌ఏ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది.

మార్గదర్శకాలను అనుసరిస్తూ..



విద్యాశాఖ రూపొందించిన మార్గదర్శకాలను అనుసరించి ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతులు చేపడుతున్నాం. పూర్తి పారదర్శకంగా పదోన్నతుల ప్రక్రియను చేపడుతున్నాం.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, నోడల్ అధికారిణి, డీఈవో, కాకినాడ జిల్లా

ఈసెట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులకు స్టేట్‌ర్యాంకు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఈసెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకు సాధించినట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఏపీ ఈసెట్ 2023 పరీక్షా ఫలితాల్లో స్టేట్‌లో 5,6,8,8,10 ర్యాంకుతో పాటుగా వందలోపు 39 ర్యాంకులను సాధించినట్టు పేర్కొన్నారు.

స్టేట్ ర్యాంకులో కె. రామ్‌తేజ 5, డి.మహేశ్వరి 6, పి.రమేష్ 8, వీఎల్‌వీఎస్ చరణ్ 8, డి.రమ్యశ్రీ 10 ర్యాంకులు సాధించి రాష్ట్రస్థాయి టాప్ పదిలో 5 ర్యాంకులను కైవసం చేసుకున్నట్టు తెలియజేశారు. వీటితోపాటు 100లోపు మొత్తం 39 ర్యాంకులను తమ కళాశాలల విద్యార్థులు సొంతం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాలల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్, డీన్ ఏవీ మాధవరావు, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

శాకంబరీ నమోస్తుతే



కనకదుర్గమ్మ



వనదుర్గ అమ్మవారు



మహాలక్ష్మీ

అన్నవరం: రత్నగిరిపై కొలువైన సత్యదేవుని సన్నిధిన ఆషాఢ పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం దర్బారు మంటపంలో కొలువైన మహాలక్ష్మీ అమ్మవారు, రత్నగిరి దుర్గామాతలు 'శాకంబరి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. తొలి ఏకాదశి పర్వదినం నుంచి రత్నగిరి దర్బారు మంటపంలో సర్వాలంకార భూషితుడైన విష్ణుమూర్తి భక్తులకు దర్శనమిస్తున్న సంగతి విదితమే. గత శనివారం నుంచి మహాలక్ష్మీ అమ్మవారిని కూడా తొలి రోజు పుష్పాల తో, ఆదివారం గాజుల అలంకరణలో, సోమవారం కాయగూరలు, ఆకు కూరలతో అలంకరించారు.

శాకంబరి అవతారంలో రత్నగిరి దుర్గామాతలు

నిత్యం స్వర్ణాభరణాలతో, పట్టు వస్త్రాలు ధరించి సర్వాంగ సుందరంగా భక్తులకు దర్శనమిచ్చే రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను, గ్రామదేవత నేరేళ్లమ్మను ఆషాఢ పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం ఆకు కూరలే వస్త్రాలుగా, కాయగూరలే ఆభరణాలుగా వివిధ రకాల పండ్లతో రూపొందించిన మాలలే హారాలుగా అలంకరించారు. అమ్మవార్లతో బాటు ఆలయాలను కూడా ఆకుకూరలు, కాయగూరలతో అందంగా అలంకరించారు. ఉదయం ఆరు గంటల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా కదంబం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు అక్షయ



రితిక అక్షయ

అలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన చిప్పాడా పోషణ రితిక అక్షయ జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల విజయనగరంలో రాష్ట్ర స్థాయిలో అండర్ 7 విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభను కనబర్చి ద్వితీయ స్థానం సాధించింది. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మస్తాన్ బాబు, కోశాధికారి కె.వి. జ్వాలాముఖి నుంచి బహుమతులను, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. పశ్చిమ బంగలో సెప్టెంబర్ 20 నుంచి 25 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరపున అక్షయ ప్రాతినిధ్యం వహించనుందని తల్లిదండ్రులు మూర్తి, తులసి తెలిపారు.

పిడుగు పడి వ్యక్తి మృతి



మద్దూరి కిట్టయ్య మృతదేహం

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో సోమవారం పిడుగు పడిన ఘటనలో మద్దూరి కిట్టయ్య (60) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వర్షాల దృష్ట్యా గోదావరి లంకలోని తన పశువుల మకాంలో గేదెలను కట్టేందుకు వెళుతుండగా అకస్మాత్తుగా పిడుగు పడింది. శరీరంపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పిడుగుపడి మృతి చెందడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కరెన్సీ నోట్ల మార్పిడి కేసులో నిందితుల అరెస్టు

నార్త్ జోన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు

రాజానగరం: నోట్ల మార్పిడితో రూ. 10 లక్షలు మిగులుతున్నాయని ఆశపడి, దగ్గరున్న రూ. 50 లక్షలు పోగొట్టుకున్న వ్యక్తికి సంబంధించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని నార్త్ జోన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషను వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. ఆర్‌బీఐ రూ.రెండు వేల నోట్ల చలామణీని ఆపివేసిన నేపథ్యంలో రూ.60 లక్షల రూ.రెండు వేల నోట్లకుగాను రూ.500 నోట్లు రూ.50 లక్షలు ఇస్తే చాలంటూ ఒక వ్యక్తి ఇచ్చిన ఆఫర్‌తో మండపేటకు చెందిన మాజేటి లక్ష్మీనారాయణ మోసపోయాడు. తన వద్ద ఉన్న రూ.50 లక్షలు తీసుకుని అవతలి వ్యక్తులు చెప్పిన విధంగా జూన్ ఒకటిన తన స్నేహితునితో కలసి కారులో కొంతమూరుకు చేరుకున్నాడు. అప్పటికే అక్కడికి నిందితులుగా ఉన్న నలుగురు వ్యక్తులు కారులో చేరుకున్నారు. వారిలో ఒకరు లక్ష్మీనారాయణతో ఫోన్‌లో మాట్లాడుతూ దగ్గరగా వచ్చి, బ్యాగ్‌లో తీసుకువచ్చిన రూ. 50 లక్షలను చూస్తుండగా కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పోలీసు సైరన్ వేసుకుని వచ్చి, ఆ రూ.50 లక్షలను తీసుకుని పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. ప్రధాన నిందితులుగా ఉన్న గాజువాకలోని హజీమాబాద్‌కు చెందిన ద్రాక్షారపు విజయ్, టెక్కలికి చెందిన పోతాల శంకర్రావు అనే ఈశ్వర్‌లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.42 లక్షలు రికవరీ చేశామన్నారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. అత్యాశకు పోయి, ఇటువంటి ఇబ్బందులు తెచ్చుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
4-7-2023

స్టాక్ మార్కెట్లు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
486	134
65,205	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కేజీ)	75,500

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్టు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేది
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యుయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోటక్లు పెరిగింది.
- ఎన్ఎస్ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సొల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కన్స్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ ఆశిష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్ఎస్ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హంస్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హంస్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హంస్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహారాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1000
» **అర్హత:** ఏదైనా డిగ్రీ, సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
» **పోస్టింగ్ స్థలం:** దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.07.2023
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** ఆగస్టు రెండు/మూడో వారం
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,045 క్లర్క్ పోస్టులు
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
» **ప్రిలిమినరీ పరీక్ష తేది:** 2023 ఆగస్టు/సెప్టెంబర్‌ల్లో
» **మెయిన్స్ పరీక్ష తేది:** అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.07.2023
» **వెబ్‌సైట్:** www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- **కేజీబీవీ-పోస్టులు 1218:** స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69, పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(మ్యాథమెటిక్స్)-45, సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- **యూఆర్ఎస్-మొత్తం పోస్టులు-23:** స్పెషల్ ఆఫీసర్-4, సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5, సీఆర్‌టీ(సైన్స్)-6, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- **పీజీసీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- **స్పెషల్ ఆఫీసర్:** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- **సీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- **పీఈటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం

- **పీజీసీఆర్‌టీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **స్పెషల్ ఆఫీసర్:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **సీఆర్‌టీ:** ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **పీఈటీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** జూలై 5, 2023
- **రాత పరీక్ష తేది:** జూలై 2023
- **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..



ఐఐటీ ఇండోర్

ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూయూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూయూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.

ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ,మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.